పూణె ఇ-స్టాక్ బ్రోకింగ్‌కు మర్చంట్ బ్యాంకర్‌గా ఆమోదం

పూణె : ప్రముఖ కార్పొరేట్ బ్రోకింగ్ హౌస్ అయిన పూణె ఇ-స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్‌కు మర్చంట్ బ్యాంకర్‌గా వ్యవహరించడానికి సెబీ ఆమోదం లభించిందని ఆ సంస్థ పేర్కొంది. ఇటీవల సంస్థ బోర్డు వివిధ ప్రమోటర్, నాన్ ప్రమోటర్ గ్రూప్ సంస్థలకు ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన 20,00,000 కన్వర్టిబుల్ వారెంట్ల కేటాయింపును ఆమోదించినట్లు పేర్కొంది.



హెచ్‌పిఎల్ రాప్టర్స్ ఫ్రాంచైజీ కో-ఓనర్‌గా తరుణ్ భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్

హైదరాబాద్ పికిల్‌బాల్ లీగ్ (హెచ్‌పిఎల్) ఫ్రాంచైజీలలో ఒకటైన 'ది రాప్టర్స్' జట్టుకు కో-ఓనర్‌గా ప్రముఖ ఫిల్మ్‌మేకర్, నటుడు తరుణ్ భాస్కర్ దాస్యం చేరినట్లు ప్రకటించారు. ఆయన, ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్ కో-ఫౌండర్లు కౌశిక్ మానేపల్లి, దివ్య ప్రియాంక రెడ్డిలతో ఉత్సాహభరితమైన యాజమాన్య బందంలో భాగమయ్యారని ఆ సంస్థ పేర్కొంది. దేశంలోనే ప్రొఫెషనల్ హైపర్-లోకల్ పికల్‌బాల్ లీగ్‌లో పోటీ పడుతున్న ఎనిమిది ఫ్రాంచైజీలలో 'ది రాప్టర్స్' ఒకటి. ఈ లీగ్ శుక్రవారం హైదరాబాద్‌లో అధికారికంగా ప్రారంభం అయ్యింది. ఈ లీగ్ అక్టోబర్ 10 నుండి డిసెంబర్ 13 వరకు సుమారు రెండు నెలల పాటు కొనసాగనుంది. నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రతి శుక్రవారం రాత్రి మ్యాచ్‌లను నిర్వహించనున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతామని తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్‌కు చెందిన ప్రముఖ బిసి నాయకుడు రామ్‌కోటి 350 మంది అనుచరుల తో కలిసి శుక్రవారం తెలంగాణ జాగృతిలో చేరారు. కవిత వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాగృతి అంటేనే పోరాటాల జెండా అని చెప్పారు. అన్నిరంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతామని తెలిపారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తామని ఈ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. కెసిఆర్ ప్రభుత్వంలో ప్రభుతా స్పత్రులకు వెళ్లిన గర్భిణులకు కెసిఆర్ కిట్‌తో పాటు ఆర్థిక సాయం అందించేవారని, కాంగ్రెస్ వచ్చాక అది బందయ్యిందని చెప్పారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లికి ఇస్తామన్న తులం బంగారం ఇవ్వడం లేదని, ఏడాదిక 2 లక్షల ఉద్యోగాలి స్తామని హామీ ఇచ్చి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. బిసిల 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు వారికి ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్ రూప్ సింగ్ నాయక్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి పాల్గొన్నారు.

హైదరాబాద్ అభివృద్ధికి ఏటా రూ.10 వేల కోట్లు

- నగరం నలుమూలలా అభివృద్ధి
- మూసీ సుందరీకరణకు కట్టుబడి ఉన్నాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



నరెడ్కో బ్రౌచర్‌ను ఆవిష్కరిస్తున్న భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ అభివృద్ధికి ఏటా రూ.పది వేల కోట్లు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అన్నివైపులా హైదరాబాద్ అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర వనరులు, అవకాశాలపై ప్రచారం బాధ్యత నరెడ్కోపై ఉందని భట్టి విక్రమార్క అన్నారు. నరెడ్కో ఆధ్వర్యంలో హైటెక్స్‌లో ప్రాపర్టీ షోను మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి భట్టి విక్రమార్క శుక్రవారం ప్రారంభించారు. నరెడ్కో బ్రౌచర్‌ను వారు ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు ప్రాపర్టీ షో కొనసాగనుంది. ఇందులో పలు స్థిరాస్తి సంస్థల స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత రెండేళ్లలో రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. మూసీ నది సుందరీకరణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుతో నగర ముఖ చిత్రం మార్చబోతున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను కలిసేలా దీని నిర్మాణం ఉంటుందన్నారు. హైడ్రాతో కొంత భయం ఏర్పడినా ఫలితాలు కనిపిస్తున్నాయని చెప్పారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలు, చెరువులను హైడ్రా కాపాడుతోందని వివరించారు. "హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయిందని ప్రచారం చేశారు. రాయదుర్గంలో ఎకరా రూ.177 కోట్ల ధర పలకడంతో నగర అభివృద్ధి ఎలా దూసుకుపోతుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పర్యావరణ పరిరక్షణ కోసం హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సులను నడిపిస్తున్నాం. భవిష్యత్తులో అన్నీ ఇవే ఉంటాయి. వీటికి పన్ను మినహాయింపులు కూడా ఇచ్చాం. మురుగునీటిని శుద్ధి చేయడానికి రూ.4 వేల కోట్ల వ్యయంతో ఎస్టిపిలను నిర్మించబోతున్నాం. నగరం నలువైపులా మెట్రోను విస్తరిస్తున్నాం. విద్య, వైద్య రంగంపై మరింత దృష్టిసారిస్తున్నాం. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో వంద స్కూళ్లను నిర్మించబోతున్నాం. ఇప్పటికే ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయి. నరెడ్కో ప్రతినిధులు సీఎస్ఆర్ నిధులను విద్య, వైద్య రంగంపై పెద్దమొత్తంలో ఖర్చు చేయండి. విల్లాలు, హై రైజ్ బిల్డింగులకే పరిమితం కావొద్దు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేయండి. సంపద సృష్టికర్తలుగా రియల్టర్లు, బిల్డర్లను రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుంది. మీ సమస్యలను పరిష్కరించేందుకు సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని భట్టి విక్రమార్క తెలిపారు.

సాలూరి రాజేశ్వరరావు సంగీతం నవ రస భరితం

- జస్టిస్ చంద్ర కుమార్



ప్రజాశక్తి- కల్చరల్

కవి రాసిన పాటకు అనువైన సంగీత స్వరాలు కూర్చిన సాలూరి రాజేశ్వరరావు సంగీతం నవరస భరితమని హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్ అన్నారు శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వాహణలో విఖ్యాత సినీ గాయక సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు 103 జయంతి సందర్భంగా ప్రముఖ గాయకుడు ఎర్రగొల్ల శ్రీనివాస్ యాదవ్‌కి సాలూరి ప్రతిభా పురస్కార ప్రదానం జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ చంద్ర కుమార్ కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారితో కలసి పురస్కారం బహుకరించి మాట్లాడారు. సాలూరి స్వర రచన చేసిన ప్రతి పాట ఆణిముత్యం అన్నారు. శ్రీనివాస్ యాదవ్ సాలూరి రాజేశ్వరరావు పురస్కారం అందుకోవటం విశేషమని వారి పేరు నిలపాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ రసమయి సంస్థ సాలూరి రాజేశ్వరరావు స్వర రచనలు ముందు తరాలకి అందించడానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పెద్దలు తమ పిల్లలకు ఏదో ఒక కళ నేర్పించాలని చెప్పారు. ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి వాసురావు మాట్లాడుతూ విఖ్యాత నటుడు ఎన్‌టిఆర్ గాయకుడు ఘంటసాల, సాలూరి రాజేశ్వరరావు శత జయంతి ఒక ఏడాదిలో వచ్చాయని గుర్తు చేశారు. అధ్యక్షత వహించి స్వాగతం పలికిన డాక్టర్ ఎంకె రాము మాట్లాడుతూ ఇరవై నాలుగు ఏళ్లుగా సాలూరి రాజేశ్వరరావు జయంతి రసమయి నిర్వహిస్తోందని తెలిపారు పురస్కారం అందుకున్న శ్రీనివాస్ యాదవ్ గానం మధురం ఆయనకు సంగీతం పట్ల అంకిత భావన ఉందని తెలిపారు. సంగీత దర్శకుడు పివి సాయిబాబ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆశా లత వ్యాఖ్యానంలో రామాచారి శిష్య బృందం పాడిన సాలూరి రాజేశ్వరరావు స్వర రచన చేసిన పాటలు హృద్యమముగా ఆలపించారు.

రూ.750 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



బంజారాహిల్స్‌లో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. రూ.750 కోట్ల విలువైన భూమిని అధికారులు కాపాడారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో ఆక్రమణలను హైడ్రా శుక్రవారం తొలగించింది. గతంలో ప్రభుత్వం ఐదు ఎకరాల్లో 1.20 ఎకరాలను జలమండలికి కేటాయించింది. ఈక్రమంలో 1.20 ఎకరాలతో పాటు మొత్తం 5 ఎకరాల భూమి తనదంటూ పార్థసారథి అనే వ్యక్తి కోర్టుకెక్కాడు. చుట్టూ ఫెన్సింగ్ వేసి బౌన్సర్లతో పాటు వేటకుక్కలతో కాపలా పెట్టాడు. కోర్టులో వివాదం ఉండగా మొత్తం భూమిని తన అధీనంలోకి తీసుకొని అందులో షెడ్లు నిర్మించాడు. ప్రభుత్వ భూమిని అడ్డాగా చేసుకుని భయబ్రాంతులకు గురి చేస్తున్నట్లు జలమండలి, రెవెన్యూ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ వాటర్ రిజర్వాయర్ నిర్మించాలనే జలమండలి ప్రయత్నాలను పార్థసారథి అడ్డుకున్నాడు. ఫేక్ సర్వే నంబర్ (403/52)తో ప్రభుత్వ భూమిని కొట్టేసే ప్రయత్నం చేశాడు. ఈ మేరకు పార్థసారథిపై బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో 4 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి 403 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఉంటే.. 403/52తో ఆక్రమణలకు పాల్పడినట్లు అధికారులు నిర్ధరించారు. అన్ రిజిస్టర్డ్ సేల్ డీడ్‌తో 5 ఎకరాల ప్రభుత్వ భూమి తనదంటూ పార్థసారథి క్లెయిమ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఈక్రమంలో షేక్‌పేట రెవెన్యూ అధికారుల లేఖ మేరకు భారీ బందోబస్తు మధ్య శుక్రవారం ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణదారు వేసిన ఫెన్సింగ్‌తో పాటు లోపల ఉన్న షెడ్లను హైడ్రా తొలగించింది. ఐదు ఎకరాల చుట్టూ కొత్తగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి.. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులను ఏర్పాటు చేసింది.

2047 నాటికి రాష్ట్రం ఎలా ఉండాలి?

- 25 వరకు రాష్ట్ర ప్రభుత్వ సర్వే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

2047 నాటికి రాష్ట్రం ఎలా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారో తెలుసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ల నాటికి సమృద్ధి, సమానత్వం, సుస్థిరతతో కూడిన తెలంగాణ అభివృద్ధి పథాన్ని నిర్దేశించే మోడల్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దిశలో ముఖ్య రంగాల్లో ప్రాధాన్యతలను నిర్ణయించనున్నది. తెలంగాణ భవిష్యత్‌ను ప్రజల స్వరం, కలలు, ఆశయాలు, ఆలోచనలే దిశా నిర్దేశం చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 25 వరకు తెలంగాణ రైజింగ్ విజన్ 2047 సిటిజన్ సర్వే నిర్వహిస్తోంది. ప్రజలు తమ ఆలోచనలు, ఆశయాలు పంచుకోవాలని ఆహ్వానించింది. ప్రణాళికలను ప్రజలే కేంద్రంగా మార్చే క్రమంలో, ప్రజలను భాగస్వాములు చేయడంతో ఇది తొలి అడుగుగా అభివర్ణించింది. https:// www.telangana.gov.in/telanganarisingలో కొద్ది సమయం కేటాయించి పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


ఎమ్మెల్యే తల్లి లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిఎం

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే మాతృమూర్తికి సిఎం రేవంత్‌రెడ్డి నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి మాతృమూర్తి రేకులపల్లి లక్ష్మీనర్సమ్మ గత నెల 29న కన్నుమూశారు. శుక్రవారం నిజామాబాద్‌లో ద్వాదశ దినకర్మ నిర్వహించగా.. సిఎం రేవంత్‌రెడ్డి హాజరై పుష్పాంజలి ఘటించారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించిన సీఎం.. తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిఎంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, రాకేష్ రెడ్డి, అధికారులు, ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు నివాళి అర్పించారు.

వెంటనే జీతాలు విడుదల చేయాలి

- వైద్య విధాన పరిషత్ ఐక్యవేదిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని వైద్య విధాన పరిషత్ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఐక్యవేదిక ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా వైద్య విధాన పరిషత్ పరిధిలోని వివిధ ఆస్పత్రుల్లో ఉద్యోగులు ప్ల కార్డులు పట్టుకుని మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు భైరపాక శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్‌లో రెగ్యులర్ డాక్టర్లు మొదలు క్షేత్రస్థాయి సిబ్బంది వరకు సెప్టెంబర్ నెల జీతం రాలేదని తెలిపారు. నెల గడిచి పది రోజులవుతున్నా జీతాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ట్రెజరీ 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలనీ, ప్రతి నెల ఒకటవ తారీఖునే వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు వి స్వాతి, ఎం మెర్సి నర్సింగ్ ఆఫీసర్లు బి వినీల, పుష్పలత, బి శైలజ తదితరులు పాల్గొన్నారు.గార్ల కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం, మంథని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రి, హన్మకొండ జిల్లా పరకాల ఏరియా హాస్పిటల్ తదితర ఆస్పత్రుల్లో ఉద్యోగులు మౌన ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు.

వేతనాలు తగ్గించడమేంటి?

- ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలోని డైలీవేజ్, పిఎంహెచ్ వర్కర్ల సమస్యల్ని పరిష్కరించాలి
- సిఎం రేవంత్‌రెడ్డికి సిఐటియు లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో


గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో 35 ఏళ్ల నుంచి పనిచేస్తున్న డైలీవేజ్, పిఎంహెచ్ వర్కర్లకు వేతనాలు తగ్గించడం, అవుట్‌సోర్సింగ్‌కు ఇవ్వడం సరిగాదని సిఐటియు రాష్ట్ర కమిటీ పేర్కొంది. తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న వారి న్యాయమైన సమస్యల్ని రాష్ట్ర సర్కారు పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. తమ జీతాల తగ్గింపును నిరసిస్తూ, టైమ్ స్కేల్ వర్తింపజేయాలని కోరుతూ గత నెల 12వ తేదీ నుంచి 3070 మంది డైలీవేజ్, కంటిన్‌జెంట్, పార్ట్‌టైమ్ వర్కర్లు సమ్మె చేస్తున్నా సర్కారుకు పట్టదా? అని ప్రశ్నించారు. వారంతా రోజుకు 12 నుంచి 16 గంటలు పనిచేస్తూ 326 ఆశ్రమ పాఠశాలలు, 136 హాస్టల్స్, 163 పిఎంహెచ్ హాస్టల్స్‌లో 1,34,527 మంది విద్యార్థులకు సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకనుగుణంగా నూతన పోస్టులను శాంక్షన్ చేయకుండా, రిటైర్ అయిన వారి స్థానంలో కొత్తవారిని నియమించకుండా వారి స్థానంలో డైలీవేజ్/పార్ట్‌టైం, కంటిన్‌జెంట్ పేరుతో వర్కర్లతో పనిచేయించుకుంటున్నారనీ, వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాలను సైతం ప్రభుత్వం ధిక్కరించడం సరిగాదని పేర్కొన్నారు. కొందరికి టైం స్కేల్ వర్తింపజేసి మిగతా వారిని ఎందుకు పక్కనబెట్టారని ప్రశ్నించారు. అవుట్‌సోర్సింగ్ విధానాన్ని అమలు చేస్తే 35 ఏండ్ల నుంచి వర్కర్లు పొందుతున్న హక్కును కోల్పోతారని, ఏజెన్సీల చేతిలో మోస పోతారని తెలిపారు. టైమ్ స్కేల్ ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి, వర్కర్‌కు ఉపయోగకరంగా ఉంటుందని తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పాఠశాల, పంచాయతీ, అంగన్‌వాడీలకు తాళం వేసిన అక్రమదారులు

- విద్యార్థులను రోడ్డుపై కూర్చోబెట్టిన వైనం
- దారి విషయంలో గ్రామస్తుల మధ్య గొడవే కారణం..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇద్దరు అక్రమదారులు.. గ్రామపంచాయతీ, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, మరుగుదొడ్లకు తాళాలు వేసి విద్యార్థులను, సిబ్బందిని బీటీ రోడ్డుపై కూర్చోబెట్టి నానా ఇబ్బందులకు గురిచేసిన సంఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం జైత్రం తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జైత్రం తండాకు చెందిన రవీందర్, అతని కుమారుడు నరేష్.. దారి విషయంలో శ్రీనివాస్‌తో గొడవపడ్డారు. ఈ విషయాన్ని గ్రామ పెద్దల సమక్షంలో కూడా మాట్లాడారు. రవీందర్‌కు న్యాయం జరగడం లేదని, మళ్లీ పంచాయితీ పెట్టి న్యాయం చేయాలని పెద్దమనుషులను ఆశ్రయిస్తే ఎవరూ రాలేదు. దాంతో రవీందర్, నరేష్ శుక్రవారం ఉదయం గ్రామపంచాయతీకి, ప్రాథమిక పాఠశాల, మరుగుదొడ్డి, అంగన్‌వాడీ కేంద్రం, ఇలా ప్రభుత్వ కార్యాలయాలన్నిటికీ తాళాలు వేశారు. అంతేకాకుండా, ఈ స్థలంలోకి ఎవరూ రాకూడదని, ఈ స్థలమంతా తామదేనంటూ పాఠశాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలపై దుర్భాషలాడుతూ దాడి చేయడానికి సిద్ధపడ్డారు. అలాగే విద్యార్థులను సైతం రోడ్డుపై కూర్చోబెట్టారు. అలాగే సేవాలాల్ గుడికి వెళ్లే దారికి కూడా చుట్టూ కంచె వేశారు. గతంలో మూడుసార్లు ఇలాగే వ్యవహరించారు.. ఆ సమయంలో కొంతమంది పెద్దమనుషులు జోక్యం చేసుకొని సర్ది చెప్పి పంపించారు. ఎన్నిసార్లు చెప్పినా వీరి బుద్ధి మారక మరొకసారి ప్రభుత్వ కార్యాలయాలకు తాళం వేసి, సిబ్బందిని బెదిరించారు. కాగా, ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతన్నాయని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని ఉపాధ్యాయులు శ్రీలత, సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి ఎస్.ఎల్లం, అంగన్‌వాడీ కార్యకర్త రేఖ తెలిపారు. జరిగిన ఘటనపై సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వగా.. చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.



'వాల్మీకి సదాస్మరణీయులు'

కల్చరల్ : రామాయణ మహా కావ్యాన్ని మానవ సమాజానికి అందించిన వాల్మీకి సదా స్మరణీయులనీ తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య గౌరీ శంకర్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సంగీత నాట్య వేదికపై వాల్మీకి జయంతి గాన సభ నిర్వహణలో జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య గౌరీ శంకర్ పాల్గొని మాట్లాడుతూ తొలి ఆది కావ్యం రామాయణం అని చెప్పారు. వాల్మీకి బోయ వానిగా పక్షులను వేటాడి జీవించే స్థితి నుండి జాతికి మార్గదర్శనం చేసే మహా ఇతిహాస సృష్టికర్తగా తరాలు గడిచినా యుగాలు మారినా నిలిచివున్నారని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై బోయ హక్కుల సమితి అధ్యక్షుడు గోపి వాల్మీకి , వాల్మీకి సంస్థ అధ్యక్షులు బొగ్గు వెంకటేష్ రచయిత మిద్దె సురేష్ పాల్గొన్నారు

బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలి

- నేడు విస్తృత స్థాయి సమావేశం
- 13న జాతీయ రహదారుల దిగ్బంధం : జాజుల శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలనే డిమాండ్‌తో శనివారం (నేడు) హైదరాబాద్ బంజారాహిల్స్ లోని కళింగ భవన్‌లో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 13న జాతీయ రహదారుల దిగ్బంధం చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. 11న నిర్వహించే సమావేశంలో అఖిలపక్ష పార్టీలు, బిసి సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, సామాజిక తత్వవేత్తలు పాల్గొంటారని వెల్లడించారు. ఆ సమావేశంలో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. హైకోర్టు స్టేను నిరసిస్తూ శుక్రవారం అన్ని జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు, దిష్టిబొమ్మల దహనాల లాంటి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. భవిష్యత్తులో బిసిల తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఏడాది దాటినా చేనేత కార్మికులకు రుణమాఫీ కాలేదు

- మంత్రి తుమ్మలకు చెరుపల్లి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేనేత కార్మికులకు రుణ మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి ఏడాది దాటినా అది అమలు కాలేదని చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. శుక్రవారం ఆయన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చేనేత కమిషనర్ శైలజా రామయ్యర్‌ను వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. చేనేత కార్మికులకు రుణ మాఫీ చేయాలని, సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలు రద్దు చేయాలని, సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, అలాగే చేనేత భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ.. హ్యాండ్ లూమ్ టెక్స్‌టైల్ శాఖకు ప్రభుత్వం నిధులు జమ చేయగానే చేనేత కార్మికుల అకౌంట్‌ల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. త్రిఫ్ట్ పథకంలో ప్రభుత్వం విడుదల చేయాల్సిన రూ.7 కోట్లు విడుదల కాగానే ఆ నిధులను కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. అలాగే సబ్సిడీ నూలు స్థానంలో తీసుకొని వచ్చే చేనేత కార్మికుల భరోసా పథకానికి జియో టాగ్ ఉన్న చేనేత కార్మికులు వ్యక్తిగత ప్రకటన ఇస్తే సరిపోతుందని, వాళ్ల ఫోటోలు అప్ లోడ్ చేయాలని కమిషనర్ అన్నారు.

త్వరలోనే ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ


- వచ్చేనెల 15 నాటికి 65 లక్షల చీరలను పంచేందుకు సిద్ధం చేయండి
- అధికారులకు చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చేనెల 15 నాటికి 65 లక్షల చీరలను పంపిణీ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ సచివాలయంలో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్‌తోపాటు జౌళి టెస్కో ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 64,69,192 మహిళా శక్తి చీరలను చీరల పంపిణీ కోసం 4.34 కోట్ల మీటర్ల క్లాత్ అవసరం ఉందన్నారు. ఇప్పటి వరకు 3.65 కోట్ల మీటర్ల క్లాత్ పవర్ లూమ్ కార్మికులు ఉత్పత్తి చేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు 33.35 లక్షల చీరలు జిల్లా స్థాయి గోడౌన్స్‌కు టెస్కో ఆధ్వర్యంలో సరఫరా చేసినట్టు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి చీరలు ఉత్పత్తి కోసం 6,900 మంది నేత కార్మికులకు ఆరు నుంచి ఎనిమిది నెలల వరకు ఉపాధి కల్పించామనీ, తద్వారా నేత కార్మికులకు ప్రతి నెల రూ. 18 నుంచి రూ.22వేల పైన వేతనం పొందుతున్నారని తెలిపారు. తెలంగాణ చేనేత బ్రాండ్ కోసం గతంలోనే లేబుల్ ఆవిష్కరించామని గుర్తు చేశారు. ఆ లేబుల్ ద్వారా నాణ్యమైన చేనేత ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఈ ఏడాది కార్మికుల సంక్షేమం కోసం రూ.48.80 కోట్లు కేటాయించామని గుర్తు చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో తాత్కాలికంగా కొనసాగుతున్న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీని యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లి హ్యాండ్ లూమ్ పార్క్‌లోకి మార్చాలని సత్వరమే పనులు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు.

డిజిటల్ అగ్రికల్చర్‌తో నూతన ఒరవడి

- ఎఐ వినియోగంతో ఎరువుల వాడకాన్ని తగ్గించాలి
- తెలంగాణ రాష్ట్రం మరో పంజాబ్ కాకూడదు : మంత్రి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'డిజిటల్ అగ్రికల్చర్'తో తెలంగాణ వ్యవసాయంలో నూతన ఒరవడి తేవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పర్యావరణానికి మేలు చేసేలా స్మార్ట్ వ్యవసాయం చేయాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో జర్మనీ ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రతినిధులు 'డిజిటల్ అగ్రికల్చర్ తెలంగాణ రోడ్‌మ్యాప్' పత్రాన్ని మంత్రికి వారు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 'ఎఐ, ఎల్‌ఒటి ఆధారిత వ్యవసాయ సేవలతో ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలి. పంజాబ్‌లా మరో క్యాన్సర్ రాష్ట్రంగా మన తెలంగాణ మారకూడదు. నేల ఆరోగ్యాన్ని కాపాడటం, రైతు ఆదాయాన్ని పెంచడం, పర్యావరణానికి అనుకూలమైన వ్యవసాయమే మన లక్ష్యంగా ఉండాలి' అని సూచించారు. జర్మనీ-భారత్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన ప్రపంచంలోని తొలి ఐటీయూ ప్రామాణిత డిజిటల్ వ్యవసాయ యూజ్‌కేస్‌ను వేములవాడలో విజయవంతంగా అమలు చేసినట్టు జర్మనీ ప్రతినిధులు వివరించారు. ఉపగ్రహ, డ్రోన్, సెన్సర్ ఆధారిత ఈ మోడల్ ద్వారా నేలలోని ఎన్‌పికె సూక్ష్మ పోషకాల లభ్యత విశ్లేషణ చేసి, అవసరమైన ఎరువుల పరిమాణాన్ని మాత్రమే సిఫారసులు చేస్తున్నామన్నారు. ఏఐ ఆధారిత పంటల గుర్తింపు మోడల్, ఉపగ్రహ డేటాతో సబ్సిడీలు, బీమా, రుణాల పారదర్శక పంపిణీ వంటి అంశాలను కూడా మంత్రికి వివరించారు. సమగ్ర డిజిటల్ వ్యవసాయ ప్లాట్ ఫార్మ్‌ను రూపొందించి, రైతులు, పరిశోధకులు, విద్యార్థులందరూ ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, డాక్టర్ రఘు చాలిగంటి, డాక్టర్ సెబాస్టియన్ బోసె, యాన్-క్రిస్టియన్ రెడ్‌లిచ్, పిజెటిఎస్ఎయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జానయ్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్యులు, వైద్య విద్యార్థులకు మానసిక ఆరోగ్య హెల్ప్ డెస్క్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యులు, వైద్య విద్యార్థుల కోసం ఇడి టి-జుడా కనెక్ట్ పేరుతో మానసిక ఆరోగ్య హెల్ప్ డెస్క్‌ను, పీర్ సపోర్ట్‌ను తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అందుబాటులోకి తెచ్చింది. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన వేరు వేరు కార్యక్రమాల్లో దీనికి సంబంధించిన పోస్టర్‌ను వైద్యారోగ్యశాఖ మంత్రి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ, రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరేంద్ర కుమార్, టిపిసిసి వైద్య విభాగం చైర్మన్ డాక్టర్ ఎం రాజీవ్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మెన్ డాక్టర్ కె మహేశ్ కుమార్, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ డి లాలయ్య, సభ్యులు డాక్టర్ విష్ణు, గాంధీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఇంద్ర పాల్గొన్నారు. గత ఐదేళ్లలో దేశంలో 119 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్యలు చేసున్నట్టు జాతీయ వైద్య కమిషన్ నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో శిక్షణ పొందిన సహచరులు, మెంటర్లు ఈ హెల్ప్‌లైన్ గోప్యంగా నిర్వహించనున్నారు. దీని ద్వారా వారికి కౌన్సెలింగ్, సూచనలు, వృత్తిపరమైన మానసిక సహాయం, అధిక ఒత్తిడి సమయాల్లో నియమిత వెల్‌నెస్ చెక్-ఇన్స్ తదితర సేవలందించనున్నారు.

హెచ్ఎండిఎ వికేంద్రీకరణకు చర్యలు

- పాలన సౌలభ్యం దిశగా ప్రణాళికలు
- డివిజన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- జోన్ స్థాయిలో అధికారుల నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మహానగరం అభివృద్ధిలో భాగంగా హెచ్ఎండిఎ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) విస్తరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. రీజనల్ రింగ్ రోడ్డుకు రెండు కిలోమీటర్ల వరకు హెచ్ఎండిఎను విస్తరించింది. హెచ్ఎండిఎ విస్తరణ దృష్ట్యా పరిపాలనా సౌలభ్యంలో భాగంగా హెచ్ఎండిఎను వికేంద్రీకరించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అందుకు సంబంధించి ప్రత్యేక ఏజెన్సీలతో రూట్ మ్యాప్ కూడా రెడీ చేస్తోంది. వికేంద్రీకరణలో భాగంగా హెచ్ఎండిఎ పరిధిని డివిజన్లు, జోన్ల వారీగా విభజించేందుకు ప్రణాళికలు చేస్తుంది. త్వరలోనే హెచ్ఎండిఎ వికేంద్రీకరణ జరగనుంది.

హైదరాబాద్ మహానగరం అతి వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం 7,257 చదరపు కిలోమీటర్లుగా ఉన్న హెచ్ఎండిఎను 10,472.72 చదరపు కిలోమీటర్లకు విస్తరించనున్నారు. కొత్త వాటితో కలిపి 11 జిల్లాలు, 104 మండలాలు, 1355 గ్రామాలకు హెచ్ఎండిఎ పరిధి పెరగనుంది. రీజనల్ రింగు రోడ్డు దాటిన తర్వాత 2 కి.మీ వరకు హెచ్ఎండిఎ గ్రోత్ కారిడార్ కిందకు రానుంది. దాంతో అక్కడి వరకు ప్లానింగ్, ఇంజినీరింగ్, ఇతర కార్యకలాపాలన్నీ హెచ్ఎండిఎ పరిధిలోకి వస్తాయి. ఈ నేపథ్యంలో పరిపాలన సౌలభ్యం కోసం హెచ్ఎండిఎ వికేంద్రీకరణ చేసే దిశగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. త్వరలోనే దీనిపై స్పష్టత రానుంది. దాంతో ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఉన్న ఔటర్ రింగు రోడ్డు నుంచి దాదాపు 40 కి.మీ దూరంతో హైదరాబాద్ రీజనల్ రింగు రోడ్డును ప్రతిపాదించారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయి. ఉత్తర భాగంలో పూర్తిస్థాయిలో భూ సేకరణ చేపట్టినట్టు అధికారులు చెబుతున్నారు. హెచ్ఎండిఎ ప్రస్తుతం ఏడు జిల్లాల్లో విస్తరించింది. కానీ ఇటీవల మరో ఐదు జిల్లాలకు విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే.. దాదాపు మూడు వేల చదరపు కిలో మీటర్ల మేరకు విస్తరించింది.

ఇప్పటి వరకు జీహెచ్ఎంసి మాదిరిగా హెచ్ఎండిఎకు ప్రత్యేక జోనింగ్ వ్యవస్థ అనేది లేదు. కేవలం ప్లానింగ్ విభాగాన్ని మాత్రమే ఆరు జోన్లుగా విభజించారు. ఏడు జిల్లాల పరిధిలో లేఅవుట్లు, నిర్మాణాల కోసం ప్రజలు హెచ్ఎండిఎను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రధానంగా సంగారెడ్డి, యాదాద్రి జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి పనులు చేసుకోవడం ప్రజలకు వ్యయప్రయాసలతో కూడుకున్నది. విస్తరించిన పరిధిని పరిగణనలోకి తీసుకుంటే, ప్రస్తుతం ఉన్న సిబ్బందికి రెండింతలు అదనంగా అవసరం అవుతారు. ఈ కారణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని హెచ్ఎండిఎ వికేంద్రీకరణకు ప్రభుత్వం పునుకున్నట్టు తెలుస్తోంది.

ప్రస్తుతం ప్రణాళికా విభాగంలో ఉన్న ఆరు జోన్ల సిబ్బంది, అధికారులు నగరం నుంచే సేవలు అందిస్తున్నారు. పరిపాలనా జోన్లు ఏర్పాటైతే క్షేత్రస్థాయి నుంచే అన్ని విభాగాలు పనిచేస్తాయి. ప్రతి జోన్‌కూ ఒక కమిషనర్, ప్లానింగ్ అధికారులు, సిఇ (చీఫ్ ఇంజినీర్), ఎస్ఇలు (సూపరింటెండింగ్ ఇంజినీర్) ఉంటారు. దీని వల్ల జోన్ స్థాయిలోనే పనులన్నీ పూర్తి చేయగలుగుతారు. రానున్న మెగా మాస్టర్ ప్లాన్‌తో పాటు పరిపాలనా వికేంద్రీకరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ వికేంద్రీకరణతో ప్రజలకు హెచ్ఎండిఎ సేవలు మరింత చేరువవుతాయని, పనుల్లో జాప్యం తగ్గుతుందని అధికారులు ఆశిస్తున్నారు. ఇక హెచ్ఎండిఎ విస్తరణతో పల్లెలకు మహర్దశ పట్టనుంది. అవి పట్టణాలుగా మారిపోనున్నాయి.



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

పెన్షన్.. ప్రభుత్వమిచ్చే భిక్షకాదు.. హక్కు

- మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని టాప్రా ఆధ్వర్యంలో పెన్షనర్ల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెన్షన్ అనేది ప్రభుత్వం ఇచ్చే దయాదాక్షిణ్య భిక్షకాదని, అది పెన్షనర్ల హక్కు అని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎం మోతిలాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన సిపిఎస్, ఎన్‌పిఎస్, యుపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల హక్కులను హరించే పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని, 8వ పిఆర్‌సిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. బిఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు పెన్షన్ విధానాన్ని రివైజ్ చేయాలని, బ్యాంకు పెన్షనర్లకు పెన్షన్ అప్‌డేట్ చేయాలని, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సుల మేరకు అదనపు పెన్షన్‌ను మంజూరు చేయాలని కోరారు. టాప్రా జిల్లా అధ్యక్షులు నూకల జగదీష్ చంద్ర మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్లకు ఐదు విడతల కరువు భత్యాన్ని మంజూరు చేయాలని, రెండవ పిఆర్‌సిని ప్రకటించి 30 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని తెలిపారు. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బకాయిలను, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టాప్రా జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్, జిల్లా గౌరవాధ్యక్షులు కుకుడాల గోవర్ధన్, బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కొప్పు రామచంద్రం, కేసాని భిక్షం రెడ్డి, టాప్రా రాష్ట్ర కమిటీ సభ్యులు వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, గుండాల బిక్షమయ్య, రాఫెల్, రాపోలు వెంకటేశం, పట్టేటి కృష్ణయ్య, చాపల అంజిరెడ్డి, భావన ఋషి, ఎస్కే అక్బర్ హుస్సేన్, గాదె నరసింహ, రిటైర్డ్ జూనియర్ లెక్చరర్ సంఘం నాయకులు ముజాహిద్ పాల్గొన్నారు.

సీనియర్లను విస్మరిస్తారా

- అలిగిన అంజన్, సిఎన్ రెడ్డి
- బుజ్జగించిన కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్‌యాదవ్ ఎంపికైన తర్వాత కొంత మంది ఆశావాహుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. టికెట్ ఆశించిన భంగపడిన మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి పార్టీపై అలిగారు. సీనియర్లుగా ఉన్న తమను విస్మరిస్తారా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అసంతృప్తితో ఉన్న నేతలను బుజ్జగించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అంజన్‌కుమార్ యాదవ్ ఇంటికి శుక్రవారం ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి వెళ్లి చర్చలు జరిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి నివాసానికి కూడా వెళ్లి మాట్లాడారు. ఈ సందర్భంగా తాము టికెట్ కోసం చేసిన ప్రయత్నాలను చెప్పుకున్నారు. నియోజకవర్గంలో వారు చేసిన సేవలను గుర్తించలేదంటూ నేతల ముందు గోడు వెళ్లబోసుకున్నారు. ఈ అసంతృప్తిని సద్దుమణిగేలా పార్టీ నాయకత్వం చర్చలు జరిపి, వారికి ఉన్న అనుమానాలను నేతలు నివృత్తి చేశారు. పార్టీలో భవిష్యత్తు ఉంటుందని, మారిన పరిస్థితుల్లో జూబ్లీహిల్స్‌ను కైవసం చేసుకునేందుకు కలిసి పని చేయాలని కోరారు. అందుకు అంగీకరించిన నేతలు జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం కోసం తమ వంతు ప్రయత్నం చేశామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పని చేసి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్టానం నవీన్‌యాదవ్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిందని తెలిపారు. ఆయన విజయం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వం పట్ల ప్రజల నమ్మకాన్ని మరింత బలపరచాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఎన్నికల్లో అందరినీ సంప్రదించిన తర్వాతనే అభ్యర్థి ఎంపిక ఉంటుందన్నారు. జూబ్లీహిల్స్‌లో అంజన్ కుమార్‌యాదవ్ పోటీ చేయాలని భావించారనీ, ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ అధిష్టానం టికెట్ నవీన్‌యాదవ్‌కు కేటాయించిందని తెలిపారు. కరోనా సమయంలో ఆయన ఎన్నో సేవ కార్యక్రమాలను చేశారనీ, ఆ క్రమంలో ఆయన కూడా కరోనా బారిన పడ్డారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి అంజన్ కుమార్ యాదవ్ పెద్ద దిక్కుగా ఉంటూ వస్తున్నారని కొనియాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ ఎన్నికల్లో అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టి కాంగ్రెస్‌ను గెలిపించారని తెలిపారు. తమ పార్టీలో నియంతృత్వం ఉండదనీ, ఆవేదనను స్వేచ్ఛగా బహిర్గతంగా చెప్పుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. అంజన్ కుమార్ యాదవ్ ముషీరాబాద్‌లో గెలిచి ఉంటే మంత్రి అయ్యేవారని వ్యాఖ్యానించారు. సిఎన్‌రెడ్డి నాయకత్వంలో రహమత్‌నగర్ డివిజన్‌లో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ చేకూర్చాలని ఆయన సూచించారు.

సిజెఐపై దాడి అనాగరికం

- నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- రిజర్వేషన్లపై సిఎం అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలి : మందకృష్ణ మాదిగ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై దాడి అనాగరి చర్య అని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఘటనకు నిరసనగా 13న కలెక్టర్ కార్యాలయాల ముందు నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన చేపట్టాలనీ,. 17న అన్ని మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, 22న చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్టు తెలిపారు. 23న చలో అమరావతి, 24న చలో చెన్నై, 25న చలో బెంగళూరు కార్యక్రమాల ద్వారా దళిత సిజెఐపై జరిగిన దాడికి నిరసన తెలుపుతామని చెప్పారు. గవాయి దళితుడు కావడం వల్లే ఈ దాడి జరిగిందని తెలిపారు. ఈ దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులు ఉన్నత స్థానాల్లో కూర్చోవడం కొంతమందికి గిట్టడం లేదని విమర్శించారు. అందుకే ఈ దాడికి తెగ బడ్డారని చెప్పారు. ఈ దాడి కేవలం చీఫ్ జస్టిస్ పై మాత్రమే కాదనీ, దేశ న్యాయవ్యవస్థ, ప్రజాస్వామిక స్ఫూర్తి మీదనే కాకుండా రాజ్యాంగ మీద జరిగిన దాడిగా పరిగణించాలని అన్నారు. భగవద్గీత, బైబిల్, ఖురాన్ కన్నా రాజ్యాంగమే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. బిసి రిజర్వేషన్ల అంశం మీద తక్షణమే సిఎం రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయం ప్రధాన చర్చల్లోకి తీసుకురావడంలో రేవంత్ రెడ్డి కృషి అభినందనీయమన్నారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా చట్టపరమైన అవరోధాలు జరగకుండా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను సాధించడానికి కృషి చేయాలని సూచించారు. 42 శాతం రిజర్వేషన్ల మీద హైకోర్టు స్టే విధించడం పట్ల కొన్ని రాజకీయ పార్టీలు సంబరాలు చేసుకోవడం దురదష్టకరమన్నారు. ఇది మంచిది కాదని హితవు పలికారు. ఆ రిజర్వేషన్ల కోసం ఎస్‌సి, ఎస్‌టి సంఘాలను కలుపుకొని పోరాడుతామని చెప్పారు.

ఉద్యోగోన్నతి ఆర్డర్లు, జీతాల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరోగ్య సంచాలకులు (డిహెచ్) పరిధిలో సివిల్ సర్జన్ల పోస్టింగ్ ఆర్డర్లు జారీ చేయడంలో చోటుచేసుకున్న తీవ్రమైన ఆలస్యంపై తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టిజిజిడిఎ) తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి.నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ ఎంకె రౌఫ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఆలస్యంతో డిప్యూటీ సివిల్ సర్జన్ల పోస్టింగ్ ఆర్డర్ల జారీ కూడా నిలిచిపోయిందని వారు తెలిపారు. పదోన్నతి ప్రక్రియ చాలాకాలం క్రితమే పూర్తయినప్పటికీ ఆర్డర్లు విడుదల కాకపోవడంతో డాక్టర్ల హక్కులు, వారి ఉత్సాహం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా, తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి) పరిధిలో పని చేస్తున్న సిబ్బంది జీతాల చెల్లింపులో జరుగుతున్న నిరంతర ఆలస్యంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఏర్పడి నిరుత్సాహానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

డిహెచ్ పరిధిలో సివిల్ సర్జన్లు, డిప్యూటీ సివిల్ సర్జన్లకు సంబంధించిన పెండింగ్ పోస్టింగ్ ఆర్డర్లు వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. టివివిపి వైద్యులందరికీ సమయానికి జీతాలు చెల్లించడానికి వీలుగా ఆ సంస్థను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ (డిఎస్‌హెచ్ఎస్)గా మారుస్తూ, 010 బడ్జెట్ కిందకి తీసుకురావాలన కోరారు. డిపిహెచ్ఎఫ్ డబ్ల్యు నుంచి టివివిపికి మారిన సుమారు 80 ఆస్పత్రులు ఇప్పటికీ తగిన సిబ్బంది లేరని తెలిపారు. సిబ్బంది పునర్విభజన ఇప్పటివరకు జరగలేదని చెప్పారు. ఈ సమస్యపై కమీషనర్ కార్యాలయం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తూ, బాధ్యతను డిఎస్ హెచ్‌ఫైల్‌పై నెట్టివేస్తూ వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆస్పత్రుల పనితీరు తీవ్రంగా దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రజలతో పాటు ప్రజాప్రతినిధుల నుంచి కూడా విపరీతమైన విమర్శలు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ జారీ చేసి తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి)ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ (డిఎస్‌హెచ్)గా విజ్ఞప్తి చేశారు. డాక్టర్ల సంక్షేమం, తెలంగాణ ప్రజారోగ్య వ్యవస్థను రక్షించడానికి వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తక్షణం జోక్యం చేసుకొని ఈ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరారు.

శాంతినగర్‌లో ఫారెస్ట్ అధికారుల దాడులు

- గుత్తి కోయల గుడిసెలు కూల్చివేత
- పురుగు మందు తాగి బాధితుడు హల్‌చల్
- చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ములుగు జిల్లా మంగపేట మండలంలోని కోమటిపల్లి-మంగపేట గ్రామాల మధ్యనున్న అడవిలో గుత్తి కోయ గూడెం అయిన శాంతినగర్ వరుసగా ఫారెస్ట్ అధికారుల దాడులతో తల్లడిల్లుతోంది. నూతన పోడు కొట్టడం, నూతన గుడిసెలను నిర్మించడం.. ఫారెస్ట్ అధికారుల దాడులకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. శుక్రవారం ఫారెస్ట్ రేంజ్ అధికారి అశోక్, డిప్యూటీ రేంజ్ అధికారి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఫారెస్ట్ అధికారులు శాంతినగర్‌లో దాడులు జరిపి గుత్తికోయల గుడిసెలను కూల్చి వేశారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి నిర్మించుకున్న గుడిసెలను అకస్మాత్తుగా ఫారెస్ట్ అధికారులు దాడులు చేసి కూల్చి వేస్తుండటంతో గుండెలవిసేలా గుత్తికోయ మహిళలు, పిల్లలు రోదిస్తూ తమ బతుకులను కూలదోయకండనీ వేడుకున్నారు. కాగా, ఫారెస్ట్ అధికారులు గుడిసెలను కూల్చుతున్న క్రమంలో శాంతినగర్‌కు చెందిన సోయం సురేష్ అనే వ్యక్తి తన కెమెరాతో ఫొటోలు తీస్తుండగా ఫారెస్ట్ అధికారులు లాక్కున్నారు. ఆగ్రహానికి గురైన సురేష్ తన మొబైల్ తనకు ఇవ్వాలని, గుడిసెలు కూల్చడం ఆపాలని, లేకపోతే క్రిమిసంహారకమందు తాగి చనిపోతానంటూ పొలాల వైపు పరుగులు తీశారు. కొంత సమయం అనంతరం పురుగుమందు డబ్బాతో తిరిగి వచ్చిన సురేష్ తాను పురుగుల మందు తాగానని చనిపోబోతున్నానని ఫారెస్ట్ అధికారుల జీప్‌కు అడ్డంగా పడుకున్నాడు. తిరిగి వెళ్ళిపోతున్న ఫారెస్ట్ అధికారుల వాహనాలను ఎక్కి నానా హైరానా చేస్తూ అధికారులను వెంబడించాడు. ఈక్రమంలో శాంతినగర్ సమీపంలోని వాగు వద్ద సురేష్ స్పృహ తప్పి పడిపోగా గ్రామస్తులు అతడిని మందు కక్కించే ప్రయత్నం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఏటూరు నాగారం సామాజిక ఆరోగ్య కేంద్రానికి సిఫార్సు చేసినట్టు ఆస్పత్రి వైద్యాధికారి స్వప్నిత తెలిపారు. సురేష్ మెరుగైన చికిత్స అందించడం కోసం ఏటూరు నాగారం నుంచి ములుగు జిల్లా కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్టు సమాచారం.

కాగా, బతుకు పోరు సాగించడానికి సుమారు 13 సంవత్సరాల క్రితం రాష్ట్రం దాటి వలసొచ్చిన గుత్తికోయలు.. మంగపేట-కోమటిపల్లి గ్రామాల మధ్య అడవిలోని వారి గూడెం పెద్ద మంగు ఆధ్వర్యంలో నివాసాలు ఏర్పరుచుకున్నారు. ఈ క్రమంలో గుత్తికోయలు పోడును విస్తరిస్తున్నారని పలుమార్లు ఫారెస్ట్ అధికారులు శాంతినగర్ పై దాడులు చేసి హెచ్చరించారు. ఇటీవలి కాలంలో గుత్తికోయలు ప్రస్తుతం ఉంటున్న గుడిసెల్లో నీటి ఊట వస్తుందని, అడవిని ఆనుకొని పోడుచేసి నూతన గుడిసెలను నిర్మించుకున్నారు. ఈ విషయంలో ఆగ్రహించిన ఫారెస్ట్ అధికారులు.. కొన్ని రోజుల క్రితం శాంతినగర్‌పై దాడులు జరిపి గుడిసెలను కూల్చి వేశారు. ఈ సంఘటనపై స్పందించిన సీపీఐ(ఎం) నాయకులు, స్థానిక పోలీసులు ఫారెస్ట్ అధికారులతో చర్చలు జరిపారు. కొన్నేండ్లుగా ఇక్కడే జీవిస్తున్న గుత్తి కోయలను ఉన్న పళంగా వెళ్ళమంటే వెళ్ళలేరని, వారికి శాశ్వత నివాసాలు ఏర్పరుచుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఫారెస్ట్ అధికారుల నుంచి శాశ్వత గృహ నిర్మాణం కోసం అనుమతులు వచ్చేవరకు నూతన పోడు చేయకూడదని, అలా చేస్తే చర్యలు తీసుకోవచ్చునే ఒప్పందాన్ని ఇరువురి మధ్య కుదిర్చారు. నాటినుంచి ప్రశాంతంగా ఉన్న శాంతినగర్‌లో ఫారెస్ట్ అధికారులు మళ్లీ దాడులు చేయడం కలకలం రేపింది. గుత్తి కోయలు వేసుకున్న గుడిసెలను నిర్ధాక్షిణ్యంగా కూల్చివేశారు. ఫారెస్ట్ అధికారులు చేసిన దాడుల వల్ల పిల్లా పాపలతో ఎక్కడుండేదని మహిళలు.. రోదించిన తీరు వర్ణనాతీతం.

అటవీ విధ్వంసానికి పాల్పడుతున్నందునే చర్యలు : ఫారెస్ట్ రేంజ్ అధికారి అశోక్

శాంతినగర్‌లోని గుత్తి కోయలు అడవిలోని మహావృక్షాలను నేలమట్టం చేయడమే కాక అడవిని ఆనుకొని నూతన పోడును చేస్తూ అటవీ విధ్వంసానికి పాల్పడుతున్నందునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఫారెస్ట్ రేంజ్ అధికారి అశోక్, డిప్యూటీ రేంజ్ అధికారి కోటేశ్వరరావు తెలిపారు. వారు గతంలో కంపార్ట్‌మెంట్ నెంబర్ ఐదులో సుమారు ఐదు నుంచి ఆరు ఎకరాల విస్తీర్ణంలో పోడు చేసి గూడెంలోని అందరూ గుడిసెలను నిర్మించుకున్నారని, వారు ఆ గుడిసెల్లో ఉంటే తమకేమీ అభ్యంతరం లేదన్నారు. అయినా తమ మాటలను లక్ష చేయక మరో ప్రాంతంలో అడవిని ఆనుకుని సుమారు 18 హెక్టార్లలో అడవిని ధ్వంసం చేసి పోడు కొట్టి నూతన గుడిసెలను నిర్మిస్తున్నారని, ఆ క్రమంలోనే పై అధికారుల ఆదేశాల మేరకు తమ విధులను తాము నిర్వర్తిస్తున్నామని వెల్లడించారు.

బిసిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.రామ్మోహన్‌రావు, వంగూరు రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (బిసిడబ్ల్యుఎఫ్-సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులుగా ఎస్ రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వంగూరు రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 75 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఏర్పడగా అందులో నుంచి 25 మంది ఆఫీస్ బేరర్లుగా ఉండనున్నారు. రాష్ట్ర కమిటీలోకి 11 మంది మహిళలను తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎస్ రామ్మోహన్‌రావు, వంగూరు రాములు ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా ముదాం శ్రీను, కోశాధికారిగా ఎ రాజు, ఉపాధ్యక్షులుగా డి లక్ష్మయ్య (ఖమ్మం), బి శ్రీనివాసులు (నాగర్ కర్నూల్), వర్ధ గాలయ్య (మహబూబ్‌నగర్), టి ఉప్పలయ్య (హన్మకొండ), శ్రీశైలం (మహబూబాబాద్), కె జంగయ్య (హైదరాబాద్ సౌత్), ఎల్క సోమన్న (సూర్యాపేట), జి సోములు (యాదాద్రి భువనగిరి), వేల్పుల జ్యోతి (నల్లగొండ), రాధ (హన్మకొండ), పెంటయ్య (సంగారెడ్డి). కార్యదర్శులుగా సిహెచ్ లక్ష్మీనారాయణ (నల్లగొండ), జె. వెంకన్న (మేడ్చల్), ఆరూరి కుమార్ (వరంగల్), కొత్తపల్లి శివకృష్ణ (సూర్యాపేట), కోట సంధ్యారాణి (యాదాద్రి భువనగిరి), పార్వతి (రంగారెడ్డి), సిహెచ్ రవి (సిద్దిపేట). రాష్ట్ర మహిళా సబ్ కమిటీ కన్వీనర్‌గా సంధ్యారాణి, కో-కన్వీనర్‌గా పార్వతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించామని తెలిపారు. వెల్ఫేర్‌బోర్డు పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే జీవో నెంబర్ 12ను సవరించి బోర్డు ద్వారానే అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ ఇసుక బజారు మోసాన్ని అరికట్టాలనీ, ఏపీలో మాదిరిగా ఉచితంగా ఇవ్వాలని కోరారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 1996 కేంద్ర చట్టం, 1998 సెస్సు చట్టం, 1979 వలస కార్మికుల చట్టాలను రక్షించాలని డిమాండ్ చేశారు. భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. వెల్ఫేర్ బోర్డు నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల పాటు జరిగిన మహాసభల్లో సిడబ్ల్యుఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ.రమ, ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పి శ్రీకాంత్, 300 మంది ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు.

బిసి రిజర్వేషన్ల నేరం బిజెపిదే

- బిఆర్ఎస్ కూడా బాధ్యత వహించాలి
- కేంద్రం వద్దకు అఖిలపక్షం తీసుకెళ్లాలి : కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల (బిసి)కు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకపోవడంలో నేరమంతా బిజెపిదేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లును కేంద్రం, ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించలేదని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలనూ ప్రధానమంత్రి, రాష్ట్రపతి వద్దకు తీసుకెళ్లాలని కోరారు. బిసి రిజర్వేషన్ల అంశంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నర్సింహ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు పాల్గొన్నారు. బిసిల రిజర్వేషన్ల నేరం బిజెపిదేననీ, దీనికి తగిన మూల్యాన్ని ఆ పార్టీ చెల్లించుకోవాల్సి వస్తుందని కూనంనేని హెచ్చరించారు. ఈ నేరానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా బీఆర్ఎస్ మద్దతునిచ్చిందన్నారు. ఇందుకు బిజెపి, బిఆర్ఎస్ పార్టీలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం విచారకరమని, కోట్లాది మంది ఆవేదనను, బాధను, ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోవడం లేదని అన్నారు. గవర్నర్ వద్ద మూడు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉంటే, వాటిని నోటిపై చేసినట్టేనని తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. బిసి రిజర్వేషన్ల విషయంలో కోర్టు ఆరు వారాలు స్టే విధించిందని, ఇందులో ఏదో మతలబు ఉన్నదని అన్నారు. న్యాయ వ్యవస్థ కూడా పేద ప్రజలను పరిహాసం చేస్తోందన్నారు. బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదించని గవర్నర్‌ది తప్పా?, లేదా బిల్లును ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వానిది తప్పా?అని అడిగారు. రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇస్తే బిజెపి, బిఆర్ఎస్ సంబురాలు జరుపుతున్నాయని చెప్పారు. బిసిలకు అన్యాయం జరిగిందనే బాధ వారిలో కనిపించడం లేదన్నారు. బిజెపి నాయకులు ఆరోపణలు చేయడం కాకుండా ఢిల్లీకి వెళ్లి బిసి రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. బిసిలకు రిజర్వేషన్లు అమలు కావాలనే చిత్తశుద్ధి ఉంటే బిఆర్ఎస్, బిజెపిలు హైకోర్టులో ఎందుకు ఇంప్లీడ్ కాలేదని ప్రశ్నించారు.

హైకోర్టు స్టే బిసిల హక్కులకు విఘాతం : పల్లా

బిసి రిజర్వేషన్ల బిల్లుకు శాసనసభలోని అన్ని రాజకీయ పార్టీలూ మద్దతునిచ్చాయని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి చెప్పారు. అయితే బిసి రిజర్వేషన్ల జీవోపై హాకోర్టు స్టే విధించడం తీవ్ర విఘాతం కలిగిందని ఆందోళన వ్యక్తం చ చేశారు. ప్రజల అభిప్రాయాన్ని ఆమోదించే బాధ్యత గవర్నర్‌పై ఉందన్నారు. కానీ గవర్నర్ ఆ బిల్లులను ఆమోదించకుండానే రాష్ట్రపతి వద్దకు పంపించారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన రూ.మూడు వేల కోట్ల నిధులు రాలేదన్నారు. హైకోర్టు తీర్పు బిసిల ఆర్థిక, రాజకీయ, విద్యావకాశాలకు విఘాతం కలిగిస్తుందని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు.

సోషల్ గేమింగ్‌లో జిడిఎఐ పాలసీ సెక్రటేరియట్ ఏర్పాటు

హైదరాబాద్ : దేశంలో వీడియో గేమ్స్ ఉండస్ట్రీ ప్రమోషన్, అభివృద్ధి కోసం గేమ్ డెవలపర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (జిడిఎఐ) ఆధ్వర్యంలో పాలసీ సెక్రటేరియట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది వీడియో గేమ్స్ పరిశ్రమతో ప్రభుత్వ సంస్థల మధ్య నిర్మాణాత్మక అనుసంధానానికి మద్దతును అందించనుందని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో ఏర్పాటు చేయబడిన ఈ పాలసీ సెక్రటేరియట్, వీడియో గేమ్‌ల పరిశ్రమకు మార్గదర్శక పాత్ర పోషిస్తుందని, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తుందని జిడిఎఐ చైర్‌పర్సన్ శ్రీధర్ ముప్పిడి తెలిపారు.

ఎసిబి వలలో గ్రామ పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్ లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. గ్రామానికి చెందిన గంగాధర శ్రీకాంత్ అనే వ్యక్తి ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్నారు. బిల్లు పేమెంట్ మంజూరీ కోసం రూ.పది వేలు పంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేశారు. దీంతో ఎసిబిని బాధితుడు ఆశ్రయించారు. పథకం ప్రకారం ఎసిబి అధికారులు ముందస్తుగా శ్రీకాంత్‌కు డబ్బులు అందించి గ్రామ కార్యదర్శికి ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

మోటార్ స్పోర్ట్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిష్టాత్మక ఎఫ్ఎంఎఇ నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు పాల్గొనే ప్రతిష్టాత్మకమైన 10వ ఎఫ్ఎంఎఇ నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ కాంపిటీషన్ 2025 పాల్గననున్నారు. ఈ కార్యక్రమం కోయంబత్తూరులోని కుమారగురు ఇన్‌స్టిట్యూషన్స్‌లో జరగనుంది. ఇంజనీరింగ్ విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభను ప్రదర్శించే ఈ జాతీయ పోటీల్లో పాల్గొంటున్నందుకు కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. యువతలో ఆవిష్కరణా దృక్పథం, టెక్నాలజీ ప్రోత్సాహం, మోటార్‌స్పోర్ట్స్ రంగంలో కొత్త ప్రతిభను వెలికితీసే వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.